ఖని దవాఖానలో కలెక్టర్ సతీమణి ప్రసవం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష సతీమణి విజయ శనివారం రాత్రి గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో ప్రసవించింది. కలెక్టర్ తన సతీమణికి మొదటి నుంచీ ప్రభుత్వ దవాఖానలోనే వైద్య పరీక్షలు చేయించగా, ఆమెకు పురిటినొప్పులు రావడంతో స్థానిక దవాఖానకు తీసుకువచ్చారు. శనివారం రాత్రి వైద్యులు ఆమెకు సిజేరియన్ చేసి ప్రసవం చేయగా, మగ బిడ్డకు జన్మనిచ్చింది. - ఫర్టిలైజర్‌సిటీ

ఎస్సెస్సీ మెమోలపై మార్కులు, గ్రేడ్లు

- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- శ్రేణుల్లేకుండా కేవలం పాస్ అని ముద్రణకు ఆమోదం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): పదో తరగతి మార్కుల మెమోలను ఎలా ముద్రించాలన్న అంశానికి సర్కారు ఎట్టకేలకు తెరదించింది. 2024-25 విద్యాసంవత్సరానికి పదో తరగతి మెమోలపై మార్కులతోపాటు గ్రేడ్స్‌ను సైతం ముద్రించాలని నిర్ణయించింది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తాజాగా ఉత్తర్వులు విడుదలచేశారు. పదో తరగతిలో ఈ విద్యాసంవత్సరం నుంచి గ్రేడింగ్ విధానాన్ని తీసేశారు. గ్రేడ్లస్థానంలో మార్కుల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇంటర్నల్స్‌ను రద్దుచేయాలని తీసుకున్న నిర్ణయం ఆల స్యం కావడంతో ఈ ఒక్క ఏడాదికి ఇంటర్నల్స్ ఉంటాయని ప్రకటించారు. మెమోలపై మార్కులు ఎలా ముద్రించాలన్న అంశంపై ఏర్పాటు చేసిన కమిటీ పలు సిఫారసులు చేసింది. దీంతో ఫలితాల విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. రెండు, మూడు రోజుల్లో ఫలితాలు విడుదల కానున్నాయి.

మెమోల ముద్రణ ఇలా..

- పదో తరగతి మెమోలపై ఇంటర్నల్స్ మార్కులు, వార్షిక పరీక్షలు మార్కులుంటాయి. మొత్తం మార్కులతో పాస్ సర్టిఫికెట్ జారీచేస్తారు. గ్రేడ్లు, మార్కులను వేర్వేరుగా ముద్రిస్తారు.
- సబ్జెక్టులవారీగా సాధించిన మార్కులు, గ్రేడ్లు రెండింటిని సర్టిఫికెట్‌లో ముద్రిస్తారు.
- పదో తరగతిలో ఇంటర్నల్స్‌లో 20 మార్కులు కేటాయించారు. ఈ పాఠ్య కార్యక్రమాలకు కూడా గ్రేడ్లు ఇస్తారు. ఎస్సెస్సీ పాస్ సర్టిఫికెట్‌లో చూపుతారు.
- పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రస్తుతం ఒక సబ్జెక్టులో 80 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో 28 మార్కులొస్తేనే పాసైనట్టు లెక్క. ఇంటర్నల్స్‌లో ఎన్ని మార్కులొచ్చినా వార్షిక పరీక్షల్లో 28 మార్కులు సాధించాల్సిందే. హిందీలో 16 మార్కులొస్తే పాస్ అయినట్టు.
- మెమోలపై ప్రథమశ్రేణి, ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి అంటూ ఏముండదు. ఎన్ని మార్కులొచ్చినా పాస్ అనే ముద్రిస్తారు.

తెలుగు భాషను కాపాడాల్సిందే

రౌండ్‌టేబుల్ సమావేశంలో భాషావేత్తల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు తెలుగును ప్రథమ భాషగా బోధించాలని పలువురు విద్యావేత్తలు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు భాషా పరిరక్షణ ఐక్య కార్యాచరణ సమితి ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. వక్తలు మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో సంస్కృతాన్ని దేవనాగరి లిపిలోనే పరీక్ష రాసేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలుగు భాషా పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వులు కూడా తెలుగులోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ చింతకింది కాశీం, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, విద్యావేత్తలు పాల్గొన్నారు.

నూతన సీఎస్‌గా రామకృష్ణారావు

- తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలు
- ఆర్థిక శాఖలో తనదైన ముద్ర
- 13 బడ్జెట్ల రూపకల్పనలో భాగం
- ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ నిధుల సమీకరణలో కీలకపాత్ర
- రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ శాఖ బాధ్యతలూ సమర్థంగా నిర్వహణ
- విధానాల రూపకల్పనలో బిట్ట
- తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు కూడా

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్ర నూతన సీఎస్ నియామకంపై కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు ప్రస్తుతమున్న ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలను కూడా చూసుకోవాలని ప్రభుత్వం మరో ఉత్తర్వులో పేర్కొన్నది. ప్రస్తుత సీఎస్ ఏ శాంతి కుమారి ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న విషయం విధితమే.

13 బడ్జెట్ల రూపకల్పనలో భాగం...

కుడ్లిగి రామకృష్ణారావు 1991బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయనకు ఆర్థికపరమైన అంశాలు, ప్రభుత్వ పాలసీల అమలులో నైపుణ్యం ఉన్నది. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం(ఐఎఫ్ఎంఐఎస్)ను ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను అత్యంత పారదర్శకతతో విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. క్లిష్ట పరిస్థితులను సైతం అధిగమిస్తూ తెలంగాణను విజయపథాన పురోగమించేలా చేయడంలో తనవంతు కృషిచేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు అయినప్పటి నుంచి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గత 12ఏండ్లుగా 13 వార్షిక బడ్జెట్లకు రూపకల్పన చేయడం ద్వారా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇందులో 11 పూర్తిస్థాయి బడ్జెట్లు కాగా, రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు ఉన్నాయి. నిరాటంకంగా 12 ఏండ్లుగా ఆర్థిక శాఖకు నేతృత్వం వహిస్తున్నందున ఆయనకు ఈ అవకాశం లభించింది. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల సమీకరణలో కీలకపాత్ర పోషించారు. అంతేకాదు, రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ శాఖ బాధ్యతలు కూడా ఆయన నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్, గుంటూరు జిల్లాల కలెక్టర్‌గా, విద్యాశాఖ డైరెక్టర్‌గా, వైద్య శాఖ, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. ప్రణాళికాశాఖ బాధ్యతల్లో భాగంగా జీఐఎస్ వ్యవస్థను పటిష్ఠపర్చడంతోపాటు వివిధ శాఖలకు చెందిన సమగ్ర డేటా సేకరణ, విశ్లేషణ ద్వారా సరైన ప్రణాళికలు రూపొందించి, అమలు చేసేందుకు కృషిచేశారు. ప్రభుత్వ విధులు సక్రమంగా కొనసాగే విధంగా వివిధ శాఖలను సమన్వయపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. విధానాల రూపకల్పన, ఆర్థికపరమైన వ్యూహాలు, అభివృద్ధి ప్రాధాన్యతలు తదితర అంశాలపై ప్రభుత్వానికి సరైన సూచనలు, సలహాలు ఇస్తూ పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఐటీ ఆధారిత సంస్కరణలు ప్రవేశపెట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఐఐటీ కాన్పూర్ నుంచి బీటెక్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎంటెక్, అమెరికాలోని డ్యూక్ యూనివర్సిటీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌లో ఎంబీఏ పూర్తిచేశారు. వచ్చే ఆగస్టు నెలాఖరుకు ఆయన పదవీ విరమణ చేయనున్నారు.

సీజీజీ వైస్ చైర్మన్‌గా గోయల్

- భారీగా ఐఏఎస్‌ల బదిలీ
- 20మందికి ఒకేసారి స్థానచలనం
- సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఒకేసారి 20మంది సీనియర్ ఐఏఎస్‌లకు స్థానచలనం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు శశాంక్ గోయల్‌ను సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) వైస్ చైర్మన్‌గా, జయేశ్‌రంజన్‌ను ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా, దాన కిశోర్‌ను కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న ఆర్వీ కర్ణన్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బదిలీ చేశారు. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న స్మితాసబర్వాల్‌ను స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా నియమించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీస్థానం
డాక్టర్ శశాంక్‌గోయల్	ఎంసీఆర్‌హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్	సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్, ఏపీటీఆర్‌ఐ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు
జయేశ్‌రంజన్	ఐటీఈ అండ్‌సీ, క్రీడాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి	ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీఎంవో, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో
సంజయ్‌కుమార్	ఎల్ ఈటీఎఫ్ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి	పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి
దానకిశోర్	ఎంపయూడీ ముఖ్య కార్యదర్శి	కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంప్లాయిమెంట్, శిక్షణ శాఖ డైరెక్టర్
స్మితా సబర్వాల్	పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి	రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ
టీకే శ్రీదేవి	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్	పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఎండీఏ బయట),
ఇలంబరి	జీహెచ్ఎంసీ కమిషనర్	పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి)
ఆర్వీ కర్ణన్	ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్	జీహెచ్ఎంసీ కమిషనర్
కే శశాంక	రాష్ట్ర ప్లాగ్‌షిప్ ప్రాజెక్టుల కమిషనర్	ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్, మైన్స్, జియాలజీ డైరెక్టర్‌గా పూర్తి అదపు బాధ్యతలు
ఎస్ హరీశ్	ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్	జెన్‌కో సీఎండీ, రెవెన్యూ శాఖ అదనపు కార్యదర్శి
కే నిఖిల	టీజీఆర్‌ఐడీ సీఈవో	రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు సెక్రటరీ, సీఈవో
సంగీత సత్యనారాయణ	సీఎం అదనపు కార్యదర్శి	ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈవోగా అదనపు బాధ్యతలు
ఎస్ వెంకట్రావు	ప్రభుత్వ ప్రొటోకాల్ డైరెక్టర్	దేవాదాయ శాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో
పీ కాత్యాయనీదేవి	స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్	సెర్ప్ అదనపు కార్యదర్శి
ఈవీ నర్సింహారెడ్డి	పాఠశాల విద్య డైరెక్టర్	ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అదనపు సీఈవో, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ
బీ హేమంత్‌సహదేవ్‌రావు	టీజీఎంఎస్ఐడీఎస్ మేనేజింగ్ డైరెక్టర్	జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్
జీ ఫణీంద్రారెడ్డి	హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్	టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్
పీ కభిరవన్	హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్
విద్యాసాగర్	ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ ఓఎస్డీ	హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు
ఆర్ ఉపేందర్‌రెడ్డి	ఎంపయూడీ అదనపు కమిషనర్	హెచ్ఎండీఏ సెక్రటరీ

28/04/2025 పాడ్యమి

సోమవారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-35. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖమాసం శుక్లపక్షం **తిథి:** పాడ్యమి రాత్రి 9-11 వరకు. **నక్షత్రం:** భరణి రాత్రి 9-38 వరకు. **వర్జ్యం:** ఉదయం 9-01 నుంచి ఉదయం 10-25 వరకు. **రాహుకాలం:** ఉదయం 7-28 నుంచి ఉదయం 9-03 వరకు. **దుర్ముహూర్తం:** పగలు 12-39 నుంచి పగలు 1-29 వరకు, **పునర్ దుర్ముహూర్తం:** పగలు 3-11 నుంచి సాయంత్రం 4-02 వరకు. **అమృతకాలం:** సాయంత్రం 5-25 నుంచి సాయంత్రం 6-49 వరకు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- దశలవారీగా పెండింగ్ అంశాల పరిష్కారం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ రిటైర్డ్ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం జరిగిన టీజీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవంలో 90 ఏండ్లు నిండిన రిటైర్డ్ ఉద్యోగులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. ప్రజారవాణా వ్యవస్థ మేలు కోసం రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, ప్రజల సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం, సంస్థ పరిరక్షణ.. ఈ మూడు అంశాలే ప్రాధాన్యాలుగా సంస్థ ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నదని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీని దేశంలోనే నంబర్ వన్ సంస్థగా మార్చేలా ప్రభుత్వం అన్ని రకాలు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అనంతరం సజ్జనర్ మాట్లాడుతూ.. రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులకు సంస్థపైనా ప్రేమ, అభిమానం ఎక్కువగా ఉంటుందని, పదవీ విరమణ పొందాక కూడా ఆర్టీసీ బాగుకోసం పరితపిస్తుంటారని అన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగవేందర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, సెక్రటరీ విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సీతరాంబాబు, ట్రెజరీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలతో జార్ఖండ్ వ్యవసాయ మంత్రి భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి శిల్పి నేహా తిర్కే ఆదివారం భేటీ అయ్యారు. ఎన్ఎంఆర్ఐ, ఎఫ్‌డీబీ, ఐఐఎంఆర్ సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆమె సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల్లో వ్యవసాయ సంబంధిత అంశాలపై సవివరంగా చర్చించారు.

నిచినోను సందర్శించిన బృందం..

జపాన్‌లో పర్యటిస్తున్న ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, డైరెక్టర్ గోపీతోపాటు అధికారుల బృందం ఆదివారం ప్రముఖ ఆగ్రో కెమికల్ సంస్థ నిచినోను సందర్శించారు. ఈ సందర్భంగా పురుగు మందులు, శిలీంధ్ర వినాశకాలపై జరుగుతున్న పరిశోధనలను తెలుసుకున్నారు. తెలంగాణలో వ్యవసాయరంగ అభివృద్ధికి నిచినో సంస్థతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని చిన్నారెడ్డి తెలిపారు.

చంచల్‌గూడ జైలుకు ఈఎన్సీ హరిరాం

సైదాబాద్, ఏప్రిల్ 27: కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ భూక్య హరిరాంను ఏసీబీ అధికారులు చంచల్‌గూడ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. శనివారం రాత్రి న్యాయమూర్తి నివాసంలో ఆయన్ని హాజరు పరిచి.. అక్కడ నుంచి చంచల్‌గూడ జైలుకు తీసుకెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్న హరిరాం ఇంటితోపాటు, ఆయన పనిచేస్తున్న కార్యాలయం, బంధువుల ఇండ్లల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

అవినీతిలో ఓవర్‌లోడ.. సేవల్లో షార్ట్‌సర్క్యూట్

- విద్యుత్తు సంస్థల్లో రాజ్యమేలుతున్న అధికారుల నిర్లక్ష్యం
- గాడి తప్పిన పని విధానం, పెద్దఎత్తున ఫైళ్లు పెండింగ్
- డిస్కంలలో పేరుకున్న అవినీతి-ఏసీబీ వరుస దాడులు
- ఏఈలకు ప్రమోషన్లు ఇచ్చినా పోస్టింగ్స్ ఇవ్వని జెన్‌కో
- యాదాద్రి పవర్ ప్లాంట్‌లో వేధిస్తున్న ఇంజినీర్ల కొరత
- ప్రభుత్వం, ఉన్నతాధికారులపై ఉద్యోగ సంఘాల విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో పాలన పూర్తిగా గాడి తప్పిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాన్స్‌కో, జెన్‌కోకు రెగ్యులర్ సీఎండీలు లేకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైందని ఆయా శాఖల్లోనే చర్చ జరుగుతున్నది. 'పెద్దసార్లు' ఆఫీసులకు రావడంలేదని తెలుస్తున్నది. ఎప్పుడో ఓసారి చుట్టం చూపుగా వచ్చినా ఫైళ్లు ముట్టుకోవడంలేదని సమాచారం. ముఖ్యమైన నిర్ణయాలు కార్యరూపు దాల్చడంలేదని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. డిస్కంలలో పైసల్లేనిదే పనులు కావడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏసీబీ దాడులు చేసినా తీరు మారడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుభవంలేని అధికారులు.. ఆగమాగం పనులు

రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. కానీ ట్రాన్స్‌కో, జెన్‌కోలో బదిలీలు చేయలేదు. ట్రాన్స్‌ఫర్ పాలసీని కూడా రూపొందించలేదు. కానీ దక్షిణ డిస్కం, ఉత్తర డిస్కం పరిధిలో మాత్రమే బదిలీలు చేశారు. ఈ బదిలీల్లోనూ లంచాలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో నాలుగు నెలలుగా అనుభవం గల ఇంజినీర్లు, సిబ్బంది లేకపోవడంతో పనులకు ఆటంకం కలుగుతున్నది. వైటీపీఎస్ యూనిట్-2 బాయిలర్‌లో ఇటీవల క్లింకర్(సున్నం బూడిద) పేరుకుపోయి ఉత్పత్తి ఆగింది. మరమ్మతులు చేస్తుండగా వేడి బూడిద మీద పడి కార్మికులు గాయపడ్డారు. కొందరు ఏకంగా రెండు జీతాలు తీసుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

ప్రమోషన్స్ ఇచ్చి.. పోస్టింగ్స్ మరిచి!

టీజీ జెన్‌కోలోని కొందరు అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ)ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2024 అక్టోబర్ 9న 203 మంది అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ)లకు అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్(ఏడీఈ)లుగా పదోన్నతి కల్పించారు. ప్రమోషన్స్‌లో అక్రమాలు జరిగాయని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై హైకోర్టు జనవరి 31న తుది తీర్పునిచ్చింది. పోస్టింగ్స్ ఇచ్చేందుకు లైన్‌క్లియర్ అయింది. తీర్పు వచ్చి నెలలు గడిచినా ఉన్నతాధికారులు పోస్టింగ్స్ మాత్రం ఇవ్వలేదు. దీంతో పాలన అస్తవ్యస్తమై, పనులు గాడి తప్పుతున్నాయని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ పంచాయతీ ఎదుట పొయ్యి వెలిగించి నిరసన తెలుపుతున్న భవాని

ఇందిరమ్మ ఇల్లు రాలేదని నిరసన

- తనకు ఎందుకివ్వలేదని పంచాయతీ కార్యాలయం ఎదుట పొయ్యి వెలిగించి మహిళ ఆందోళన

సైదాపూర్, ఏప్రిల్ 27 : నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన తాడవేణి భవాని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పొయ్యి వెలిగించి నిరసన తెలిపింది. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో తనపేరు లేకపోవడంతో వంట సామగ్రి, మంచం, తదితర వస్తువులతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చింది. తనకు ఇల్లు ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ జీపీ ఎదుట పొయ్యి పెట్టి వంట చేసింది. దీంతో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని, ఇల్లు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించింది.

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మార్కెట్‌యార్డ్‌లో వర్షానికి ధాన్యం కొట్టుకుపోగా, ధాన్యాన్ని పారతో దగ్గరకు చేర్చుతున్న రైతు

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

నారాయణపేట జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

మక్తల్/చౌటుప్పల్/ భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 27 : నారాయణపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసింది. నారాయణపేట జిల్లా మక్తల్‌లో మండలం ఉప్పర్‌పల్లిలో పిడుగుపడటంతో భవన నిర్మాణ కార్మికుడు అంజప్ప(30) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే మండలంలో దాదన్‌పల్లిలో పిడుగుపాటుకు కురుమూర్తి (16) మరణించాడు. మక్తల్ పట్టణంతోపాటు కృష్ణ మండలం కాంచోటి గ్రామంలో పిడుగుపాటుకు రెండు పశువులు మృత్యువాతపడ్డాయి. మాగనూరు, కృష్ణ మండలాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌తోపాటు భూదాన్ పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెంలో ధాన్యం తడవడంతో అన్నదాతలు అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిసిందని, ధాన్యం తెచ్చి పదిరోజులైనా కొనుగోలు చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్రెగుట్టలో సొరంగాలు

ములుగు, ఏప్రిల్ 27(నమస్తేతెలంగాణ) : ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో మావోయిస్టుల జాడ కోసం పోలీసు బలగాలు చేపడుతున్న కూంబింగ్ ఆదివారం 7వ రోజుకు చేరుకున్నది. తుపాకీ తూటాలు, బాంబుల శబ్దాలతో అడవి దద్దరిల్లుతున్నది. రాత్రింబవళ్లు సాగుతున్న ఈ కూంబింగ్‌లో కర్రెగుట్టల్లోని సొరంగాలు, గుహలు సవాల్‌గా మారినట్టు తెలుస్తున్నది. కర్రెగుట్టలపై శాస్త్రీయంగా ఏర్పడిన గుహలతోపాటు మావోయిస్టులు ఏర్పర్చుకున్న సొరంగాలు అనేకం ఉన్నట్టు సమాచారం. కూంబింగ్ పార్టీలకు దొరకకుండా మావోయిస్టులు సొరంగాలు, గుహలలో తల దాచుకున్నట్టు కేంద్ర బలగాలు అనుమానిస్తున్నట్టు తెలిసింది. మావోయిస్టులకు కంచు కోట అయిన కర్రెగుట్టలను చుట్టుముట్టిన కేంద్ర బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నది. ఇటీవల ముగ్గురు మహిళా మావోయిస్టులు ఎదురు కాల్పుల్లో మృతి చెందగా, వారి మృతదేహాలను బీజాపూర్‌కు తరలించారు. శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో దాదాపు 38 మంది మావోయిస్టులు హతమైనట్టు వార్తలు చక్కర్లు కొట్టగా దీనిపై పోలీస్ బలగాలు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. పోలీసుల హిట్ లిస్టులో అగ్ర నాయకులు హిడ్మా, దేవలే టార్గెట్‌గా ఈ కూంబింగ్